
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



ఎంపీడీఓలకు స్థానాల కేటాయింపు

జిల్లాకు వచ్చిన 35 మంది ఎంపీడీఓలకు స్థానాలను కేటాయిస్తూ జిల్లా పరిషత్ యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది.

8లో



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.9°/15.4°

జిల్లా పరిధిలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

10న నవోదయ ప్రవేశ పరీక్ష



లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 1003 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరికి నవోదయ విద్యాలయంలోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేరోజే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి లేపాక్షిలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు 619 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 11 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

జోరుగా ఇళ్ల రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ పత్రాలు లబ్ధిదారురాలికి ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప

హిందూపురం అర్బన్: పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా పక్కా ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతో పాటు ఆర్థికంగా భరోసా కల్పించడంతో చాలా మంది పేదలు సొంతిళ్లలోకి చేరుకున్నారు. ఇప్పుడు మహిళల పేరిట ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను ప్రారంభించడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండలంలోని తూమకుంట, ఓబ్లాపురం, ఇరికెర, మనేసముద్రం సచివాలయాల్లో పలువురు లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు.

టైలరింగ్ కోర్సులకు ఉచిత శిక్షణ



మడకశిరరూరల్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో టైలరింగ్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు స్థానిక ఎస్వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ ఆపై చదివిన వారు ఈ కోర్సులకు అర్హులని పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో నాలుగు నెలలు పాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని వివరించారు. ఆసక్తి గల వారు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సాయి గణేష్ సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్: 9966682246ను సంప్రదించాలని సూచించారు.

5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (బాలురు)లో 5వ తరగతిలో ప్రవేశం పొందడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మధుసుదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీలకు 75 శాతం, ఎస్సీ కన్వర్టు క్రిస్టియన్ (బీసీ-సీ)లకు 12 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 5 శాతం, ఓసీలకు 2 శాతం చొప్పున సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 23వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మార్చి 10న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తామన్నారు. 3, 4 తరగతులను గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి ఉండాలని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.లక్షలోపు ఉండాలన్నారు. 5వ తరగతిలో ప్రవేశానికి https:// apgpcet. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చదువు.. సంపాదించు

- ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్సెస్ విద్యార్థులకు అవకాశం
- ప్రభుత్వ ఉన్నతపాఠశాలలకు ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్
- విద్యార్థులు, ఉపాధ్యాయులకు 'స్మార్ట్' బోధనపై శిక్షణ
- ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.12 వేల స్టైఫండ్
- జేఎన్‌టీయూఏ పరిధిలో 1,014 మంది విద్యార్థుల ఎంపిక



ఇంటర్న్‌షిప్‌పై ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

అనంతపురం: ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్సెస్ విద్యార్థులను భవిష్యత్ నైపుణ్య నిపుణులు (ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్)గా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బీటెక్, ఎంటెక్‌తో పాటు ఎంసీఏ కోర్సుల్లో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పించింది. ముఖ్యంగా కంప్యూటర్ సైన్సెస్ విద్యార్థులకు ప్రాధాన్యం కల్పించారు. దీని తర్వాత అవసరాన్ని బట్టి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ), మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ విద్యార్థులను పరిశీలిస్తారు. దేశంలోనే ఇలాంటి కార్యక్రమం అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుంది.

3,024 పాఠశాలలకు 1,014 మంది విద్యార్థులు

జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల్లోని 44 ఇంజినీరింగ్ కళాశాలల్లో మొత్తం 1,014 మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. వీరిని మొత్తం 3,042 ఉన్నత పాఠశాలలకు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌లో భాగంగా ఒక్కో ఇంజినీరింగ్ విద్యార్థి నాలుగు నెలల పాటు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు. ఒక్కో ఇంజినీరింగ్ విద్యార్థికి మూడు ఉన్నత పాఠశాలలను కేటాయించారు. వారానికి రెండు రోజులు పాఠశాలలకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ట్యాబ్‌ల వాడకం, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ తరగతులు, స్మార్ట్ క్లాసుల బోధనపై శిక్షణ ఇస్తారు. నాలుగు నెలల ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.12 వేలు స్టైఫండ్ చెల్లిస్తారు.

'వర్చువల్'లో మరో ఇంటర్న్‌షిప్

రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలనూ సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాలతో జత చేశారు. ఇప్పటికే కళాశాలల మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉన్నత పాఠశాలలో ఇంటర్న్‌గా చేస్తూనే వర్చువల్ విధానంలో కూడా మరో ఇంటర్న్‌షిప్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. భవిష్యత్తులో బోధన రంగంలో రాణించాలనుకునే వారికి, జాబ్ మార్కెట్ ఓరియంటెడ్ కోర్సులు నేర్చుకోవాలనుకునే వారికి రెండు విధాలా ఇంటర్న్‌షిప్ దోహదపడుతుంది. వాస్తవానికి విద్యార్థి దశలోనే ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాన్ని సాధించడానికి ప్రభుత్వం ఉన్నత విద్యలో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే.

ఇప్పటికే ఏటీఎల్ మెంటార్‌షిప్

ఉన్నత విద్యలో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ కింద ఇంజినీరింగ్ విద్యార్థులు ఇప్పటికే హైస్కూల్ బాటపడుతున్నారు. రెండు నెలల పాటు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ ఉంటుంది. ఇందులో భాగంగా హైస్కూళ్లలో 'అటల్ టింకరింగ్ ల్యాబ్' (ఏటీఎల్)కు మెంటార్‌షిప్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఈ కోర్సుల్లోనే శిక్షణ

ఫ్యూచర్ స్కిల్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ (ఐఓటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), బ్లాక్ చైన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ (వీఆర్), అగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), మెటావర్స్/వెబ్ 3.0, మోడలింగ్ అండ్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా/డేటా ఎనలిస్ట్, రోబోటిక్స్‌లో బేసిక్స్ బోధించనున్నారు. దీని ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థుల సహాయంతో బేసిక్స్ నేర్పిస్తూనే.. పాఠశాల ఉపాధ్యాయులకు డిజిటల్ పరికరాలపై విద్యా బోధన, హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్స్ వినియోగంపై శిక్షణ కల్పిస్తున్నారు. అలాగే కొత్త కంటెంట్ ఇన్‌స్టాల్ చేసి అందిస్తారు.

చదువుతో పాటే సంపాదన



దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర విద్యార్థులు చదువుతో పాటే సంపాదించనున్నారు. ప్రభుత్వ హైస్కూళ్లలో స్టైఫండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్ ఓ గొప్ప మార్పునకు నాంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో చేపట్టిన విప్లవాత్మక మార్పులతోనే ప్రభుత్వ బడుల్లో డిజిటల్ లిటరసీ పెరుగుతోంది. విద్యార్థులు స్మార్ట్ ప్యానల్స్‌పై పాఠాలు వింటున్నారు. వీటి ద్వారా మరింత నాణ్యమైన సాంకేతిక పాఠాలను నేర్పించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌కు పంపాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నాం.

– జీవీఆర్ శ్రీనివాసరావు, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం.

ఇంజినీరింగ్ విద్యార్థులకు క్రెడిట్లు



జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఫ్యూచర్ స్కిల్ ప్రోగ్రాంకు సంబంధించి 785 మంది విద్యార్థులను ఎంపిక చేశాం. నెలకు రూ.12 వేల స్టైఫండ్‌తో పాటు వారికి ఇంజినీరింగ్ డిగ్రీలో క్రెడిట్స్ కూడా కలుపుతాం. బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ చివరి సంవత్సరం విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్ ప్రోగ్రాంకు ఎంపిక చేశాం. ఇంటర్న్‌షిప్‌కు స్టైఫండ్ కల్పిస్తూ ఉన్నత పాఠశాలలో సాంకేతిక విద్యను అందించే బృహత్తర పథకాన్ని అమలు చేసే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం దేశ చరిత్రలోనే తొలిసారి కావడం గర్వకారణం.

– సి. శశిధర్, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ అనంతపురం

ఇంజినీరింగ్ విద్యార్థులకు వరం



ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్ ఇంటర్న్‌షిప్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వరం లాంటిది. కోర్సు చేస్తూనే ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించారు. ఒక్కో ఇంజినీరింగ్ విద్యార్థికి ఆసక్తి గల సబ్జెక్టును ఎంపిక చేసుకునే అవకాశంతో పాటు ఇంజినీరింగ్ కళాశాలకు సమీపంలోని ఉన్నత పాఠశాలకు కేటాయించాం. విద్యార్థులకు పర్యవేక్షణతో పాటు మార్గదర్శకత్వం ఎప్పటికప్పుడు చేస్తున్నాం.

– డాక్టర్ మాధవి, ఫ్యూచర్ స్కిల్ కోఆర్డినేటర్, జేఎన్‌టీయూ

ఫాస్ట్‌ట్యాగ్‌కు కేవైసీ గడువు పొడిగింపు

హిందూపురం అర్బన్: ఫాస్ట్‌ట్యాగ్ వినియోగదారులు కేవైసీ అప్‌డేట్ చేయడానికి ఈనెల 29వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు తెలిపారు. 'వన్ వెహికల్..వన్ ఫాస్ట్ ట్యాగ్' విధానానికి శ్రీకారం చుట్టిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఫాస్ట్ ట్యాగ్‌కు కేవైసీ తప్పనిసరి చేసింది. ఫాస్ట్ ట్యాగ్ కేవైసీ పూర్తి చేసేందుకు జనవరి 31 వరకూ గడువు ఇచ్చింది. కానీ వివిధ కారణాలతో చాలామంది వాహనదారులు గడువులోపు కేవైసీ చేసుకోలేకపోయారు. దీంతో గడువును మరో నెల పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గడువు తేదీ తర్వాత కేవైసీ చేయని ఫాస్ట్ ట్యాగ్ పనిచేయదని తెలిపారు.

15 లోపు పంటలు నమోదు చేసుకోండి



రొద్దం కొట్టాల రైతులతో మాట్లాడుతున్న డీఏఓ సుబ్బారావు

రొద్దం: రబీలో సాగు చేసిన పంటల వివరాలను ఈనెల 15వ తేదీలోపు (ఈ క్రాప్ బుకింగ్) నమోదు చేసుకోవాలని డీఏఓ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆర్.కొట్టాల వద్ద ఈ క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. 2023–24 పంటల కాలంలో నమోదు చేసిన పుష్పశనగ ఈ క్రాప్ బుకింగ్ చేసిన పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు అంజాద్, హంసవేణి, వీహెచ్ఏలు కవిత, గోవిందప్ప, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ పర్యటన

మడకశిరరూరల్: రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ శనివారం మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నారని ఎంఈఓ భాస్కర్ తెలిపారు. ఉదయం 9.40 గంటల నుంచి 10.30 గంటల వరకూ మడకశిర మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేస్తారని పేర్కొన్నారు. అనంతరం రొళ్ల, అగళి మండలాల్లో పర్యటించి పాఠశాలలను తనిఖీ చేస్తారన్నారు.

తుంకూరు రైలుమార్గానికి రూ.250 కోట్లు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం-తుంకూరు రైలు మార్గం నిర్మాణానికి రైల్వే బడ్జెట్‌లో రూ.250 కోట్ల నిధులు కేటాయించారు. ఈ మేరకు నైరుతి రైల్వే ముఖ్య సమాచార అధికారి మంజునాథ కనమడి ఒక ప్రకటన విడుదల చేశారు. తుంకూరు - రాయదుర్గం నూతన బ్రాడ్‌గేజ్ రైలులైను పనులు 207 కిలోమీటర్ల పరిధిలో జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును రైల్వే శాఖ, కర్ణాటక, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వాలు వారి భూభాగంలో 50:50 శాతం నిష్పత్తి ఆధారంగా పంచుకుని నిర్మాణం చేసుకుంటున్నాయి. బడ్జెట్‌లో ప్రతిసారి తక్కువ నిధులు విడుదలవుతున్న క్రమంలో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం, కదిరిదేవరపల్లి, దొడ్డహళ్లి వరకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రాయదుర్గం నుంచి ఆవులదట్ల, కళ్యాణదుర్గం మీదుగా కదిరిదేవరపల్లి వరకు రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. కొట్టాళం, మడకశిర వరకు రైల్వే లైను పనులు పూర్తయితే ఆంధ్రా సెక్షన్ పూర్తవుతుంది. కర్ణాటకలో కూడా అవసరమైన చోట్ల భూ సేకరణ, బ్రిడ్జిల నిర్మాణ, ఇతరత్ర పనులు జరుగుతున్నాయి.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

- ఎస్పీ మాధవరెడ్డి



మైదానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి: పోలీసులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌లతో కలిసి బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఫైరింగ్ రేంజ్ మైదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడారు. తాత్కాలిక ఫైరింగ్ రేంజ్ మైదానంలో అన్ని ఆయుధాలతో ఏఆర్, సివిల్ పోలీలుసులకు ఫైరింగ్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఏడాది మొబలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి సిబ్బందికి ఫైరింగ్, విధుల నిర్వహణపై శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో ఏఆర్ విభాగం సిబ్బంది కీలక భూమిక వహిస్తారన్నారు. అంతకుముందు ఎస్పీ, కలెక్టర్, జేసీ మైదానాన్ని పరిశీలించారు. ఫైరింగ్ రేంజ్‌కు మైదానం అనువుగా ఉందని పేర్కొన్నారు. తర్వాత ఎస్పీ మాధవరెడ్డి పోలీసులకు ఫైరింగ్‌పై శిక్షణ ఇవ్వటంతో పాటు పలువురికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్ విష్ణు, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఎస్పీలు వాసుదేవన్, విజయ్‌కుమార్, శ్రీనివాసులు, ఎస్బీ సీఐ రవీంద్రారెడ్డి, సీఐలు రామయ్య, కొండారెడ్డి, రాజా రమేశ్, హేమంత్‌కుమార్, పలువురు ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈసీ ఆదేశాలు తప్పక పాటించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఇచ్చే ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల సన్నద్ధత, ఎలక్ట్రోరల్, ఇతర సమస్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని పలు శాఖల అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌తో పాటు జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, ఎన్నికల డీటీలు మైనుద్దీన్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంలోనూ సకాలంలో పురోగతి చూపాలన్నారు. ఓటర్ల జాబితాలోని తప్పులు, మార్పులు, చేర్పులపై ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించి ఎప్పటికప్పుడు వివరాలను ఎన్నికల కమిషన్‌కు పంపాలన్నారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నోడల అధికారులు ఎన్నికలకు సంబంధించి విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓల పనితీరుపై పర్యవేక్షణ, రాజకీయ పార్టీల ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఎలక్ట్రోరల్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా మరుగుదొడ్లు, ర్యాంపులు లేకుంటే పూర్తి చేయాలన్నారు. ఈవీఎంల వినియోగం, వీవీ ప్యాట్‌ల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలు, ఈవీఎంలను భద్రపరిచే కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సిగరెట్ల లారీ పట్టివేత

- బిహార్ నుంచి మధురైకు అక్రమ రవాణా
- మరూరు టోల్‌గేట్ వద్ద జీఎస్టీ అధికారుల దాడి
- రూ.3.48 కోట్ల విలువ చేసే సిగరెట్లు సీజ్



సిగరెట్ల బండిళ్లను సీజ్ చేసిన జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అనిత, సిబ్బంది

అనంతపురం సిటీ: సిగరెట్లను అక్రమంగా తరలిస్తున్న లారీని జీఎస్టీ అధికారులు పట్టుకున్నారు. బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 44)లో సిగరెట్లను అక్రమంగా తరలిస్తున్నారని జీఎస్టీ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆ శాఖ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ జి.అనిత తమ బృందంతో గురువారం రాత్రంతా కాపు కాశారు. శుక్రవారం తెల్లవారుజామున అనంతపురం సమీపాన మరూరు టోల్‌ప్లాజా వద్ద బిహార్ నుంచి మధురైకు వెళ్తున్న లారీని ఆపి సోదాలు చేశారు. అందులో గోల్డ్ స్టెప్ ఫిల్టర్, ప్యారిస్ వంటి బ్రాండ్లకు చెందిన సిగరెట్ల బండిళ్లను గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.3.48 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వీటికి సంబంధించి ఎటువంటి పత్రాలూ లేకపోవడంతో లారీలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. సిగరెట్లను జీఎస్టీ కార్యాలయ గోదాములో భద్రపరచి సీజ్ చేశారు. లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసును లోతుగా విచారణ చేపట్టినట్లు సహాయ కమిషనర్ అనిత వెల్లడించారు.

మురిపించన్



అమరాపురం మండలం తమ్మడేపల్లిలో వృద్ధురాలు తులసమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ కల్పన

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కొనసాగుతోంది. రెండోరోజు శుక్రవారానికి సుమారు 93 శాతం పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలో 32 మండలాల పరిధిలోని 2,74,578 మంది లబ్ధిదారులకు రూ.81,95,62,500 నగదు మంజూరు చేశారు. ఇప్పటి దాకా వలంటీర్లు 2,55,888 మందికి రూ.76,28,43,500 మొత్తాన్ని పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మరో మూడు రోజులు పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- ఎన్నికలకు సిద్ధం కావాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు
- మడకశిర నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన



అగళిలో సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి . చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప

మడకశిర: వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జోనల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మడకశిర నియోజకవర్గంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మంత్రి పర్యటనకు ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాల్లో పర్యటించిన మంత్రి పెద్దిరెడ్డి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. అందరూ ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. పార్టీ ముఖ్యమైన నేతల ఇళ్లకు వెళ్లి వచ్చే ఎన్నికల్లో చురుగ్గా పని చేయాలని కోరారు. మడకశిరలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, అగళి జేసీఎస్ కన్వీనర్ మహేంద్ర, అగళి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, హల్కూరు కాంతరాజు తదితర ఇళ్లకు మంత్రి వెళ్లి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలన్నారు. ఐదు మండలాల్లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో అనంతపురంలో ఈనెల 10న జరిగే సిద్ధం సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గొనే ఈ సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఈర లక్కప్ప ఇంటిని సందర్శించిన మంత్రి



వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్పను సన్మానిస్తున్న మంత్రి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన పర్యటనలో భాగంగా గుడిబండ మండలంలోని ఫళారం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప ఇంటిని సందర్శించారు. మంత్రికి ఈర లక్కప్ప కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి సన్మానించారు. సమన్వయకర్తగా నియమించినందుకు ఈర లక్కప్ప కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వెంట హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, మాజీ మంత్రి నర్సేగౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కుంచిటి వక్కళిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, పార్టీ మడకశిర నియోజకవర్గ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, పెనుకొండ వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల భానుమతి, హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని ఉన్నారు.

క్లుప్తంగా

కత్తెర పురుగు నివారించుకోండి

- డాట్ వ్యవసాయ శాస్త్రవేత్తలు



సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

చిలమత్తూరు: మొక్కజొన్నలో కత్తెర పురుగును ఆదిలోనే నివారించుకోవాలని రైతులకు పుట్టపర్తి డాట్ శాస్త్రవేత్తలు రామసుబ్బయ్య, రవి కిషోర్ సూచించారు. చిలమత్తూరు మండలం అప్పనపల్లి, దేమకేతేపల్లి గ్రామాల్లోని రైతుల పొలాలను శుక్రవారం వారు సందర్శించి వరి, మిరప, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఎకరానికి కొరాజిన్ 60 మి.లీ, ఇమామెక్టిన్ బెంజోయిట్ 80 గ్రాములు పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే 30–50 రోజుల వ్యవధిలో 20 కిలోల పొటాష్, 50 కిలోల యూరియా వేసుకోవాలన్నారు. మిరపలో బూడిద తెగులు నివారణకు హెక్సాకొనజోల్, కార్బండిజమ్‌ను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ అల్తాఫ్ ఆలీఖాన్, ఏఓ వంశీకృష్ణ, ఏఈఓ శ్రీవిద్య, వీఏఏలు, రైతులు సోమచంద్రారెడ్డి, కుళ్లాయప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదరహిత డ్రైవింగే లక్ష్యం



డిపో ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేస్తున్న డీపీటీఓ మధుసూదన్

హిందూపురం: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదరహిత డ్రైవింగే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని ఆర్టీసీ డ్రైవర్లకు జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆయన పరిగి బస్టాండ్, హిందూపురం డిపోను పరిశీలించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద నష్టానికి కారణమవుతుందన్నారు. మత్తు పదార్థాలు, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. మంచి అలవాట్లతో ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీకాంత్, సీఐ హంపన్న, టీఐ రామకృష్ణ, గ్యారేజ్, ట్రాఫిక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాడు దుర్భిక్షం... నేడు సస్యశ్యామలం

- చంద్రబాబు హయాంలో వర్షాలు లేక భారీగా పతనమైన భూగర్భ జలం
- 2014–2018 మధ్య వాల్టా పరిధిలోకి 475 గ్రామాలు
- భారీ వర్షాలతో నాలుగేళ్లలో ఉప్పొంగిన గంగ
- గణనీయంగా తగ్గిన వాల్టా పరిధి



అనంతపురం అగ్రికల్చర్: గత నాలుగున్నరేళ్లుగా విస్తారమైన వర్షాలతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగి ఉమ్మడి జిల్లా పరిధిలో వాల్టా చట్టం పరిధిలోని గ్రామాల సంఖ్య పూర్తిగా తగ్గింది. 2014–2018 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భజలాలు పూర్తిగా క్షీణించిపోయాయి. ఒకానొక సమయంలో జిల్లా సగటు నీటి మట్టం చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 27 మీటర్లకు పతనం కావడంతో తీవ్ర ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు చంద్రబాబు పాలించిన ఐదేళ్లూ సగటు నీటి మట్టం 18 నుంచి 27 మీటర్ల మధ్య నమోదవుతూ వచ్చింది. ఇందులో కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 60 నుంచి 90 మీటర్ల అత్యంత కనిష్ట స్థాయికి చేరుకోవడం గమనార్హం. దీంతో అప్పట్లో వాల్టా గ్రామాల సంఖ్య 400 నుంచి 500 వరకు చేరుకుంది. వాల్టా పరిధి ప్రకటించిన గ్రామాల్లో వ్యవసాయానికి కొత్తగా బోరుబావులు తవ్వడానికి వీలు లేదు. అలాగే ఇసుక తవ్వకం, మైనింగ్ లాంటి వాటికీ అనుమతులు ఉండవు. ఏదైనా అత్యవసరమయితే తాగునీటి అవసరాలకు మాత్రమే ఉన్నతాధికారుల అనుమతితో బోర్లు వేయడానికి వెసులుబాటు ఉండేది.

2018లో 475 గ్రామాల్లో 'వాల్టా'

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లూ వరుణుడు పూర్తీగా మొహం చాటేయడంతో వాల్టా గ్రామాల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. 2018లో ఉమ్మడి జిల్లా పరిధిలోని 44 మండలాల పరిధిలో ఏకంగా 475 గ్రామాలు వాల్టా పరిధిలోకి చేర్చారు. అంటే అప్పట్లో డేంజర్‌జోన్ జాబితాలో 44 మండలాలు చేరాయి. 2017–18 మినహా అంతకు ముందు నాలుగేళ్లూ సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో భూగర్భజలాలు పూర్తిగా క్షీణించిపోయాయి. ఈ క్రమంలో వాల్టా గ్రామాల సంఖ్య భారీగా పెరుగుతూ వచ్చింది. కొత్తగా బోర్లు వేసినా 90 శాతం నీటి చుక్క కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వ్యవసాయంలో రైతులు బాగా నష్టపోయారు. ఓవరాల్‌గా చంద్రబాబు ఐదేళ్ల హయాంలో వాల్టా గ్రామాల సంఖ్య 350 నుంచి 500 వరకు నమోదు కావడం గమనార్హం. ఈ వ్యత్యాసాన్ని గమనించిన రైతులు 'బాబు హయాం... కరువుకు నిలయం' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

2019 నుంచి తగ్గుముఖం

2019 మే నెలలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు. 2019 ఆగస్టు నుంచి వరుణుడు కరుణించడంతో భారీ వర్షాలు మొదలయ్యాయి. అలా నాలుగేళ్లూ కరువు తీరేలా వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా 2019లో 551 మి.మీ, 2020లో 846 మి.మీ, 2021లో 555 మి.మీ, 2022లో 770 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. 2019 మే నెలలో 27 మీటర్లలో ఉన్న భూగర్భజలమట్టం 2019 డిసెంబర్ నాటికి 18 మీటర్లకు చేరుకున్నాయి. అలా క్రమక్రమంగా పైపైకి రావడంతో 2022 నాటికి 6 మీటర్లకు చేరుకోవడం విశేషం. ఎటు చూసినా జలసిరి సంతరించుకుంది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో 2019లో వాల్టా గ్రామాల సంఖ్య 375 గ్రామాలు ఉండగా 2020 నాటికి 266 గ్రామాలకు తగ్గింది. అలాగే 2021లో 131 గ్రామాలు, 2022లో 75 గ్రామాలకు... తాజాగా ప్రకటించిన జాబితాలో 48 గ్రామాలకు చేరుకుంది. ఇందులో అనంతపురం జిల్లాలో కేవలం రెండు మండలాల పరిధిలో ఆరు గ్రామాలు ఉండగా, శ్రీసత్యసాయి జిల్లాలో 10 మండలాల పరిధిలో 42 గ్రామాలను చేర్చారు. చంద్రబాబు హయాంలో దుర్భిక్షం, కరువు పరిస్థితులు కారణంగా వాల్టా గ్రామాలు పెరిగిపోగా... గత నాలుగున్నర ఏళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విస్తారంగా వర్షాలు కురిసి వాల్టా గ్రామాల సంఖ్య భారీగా తగ్గిపోవడం గమనార్హం.

13 నుంచి సేవాలాల్ జయంత్యుత్సవాలు



చలో సేవాఘడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అనంత కలెక్టర్ గౌతమి, తదితరులు

అనంతపురం అర్బన్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 285వ జయంత్యుత్సవాలు ఈ నెల 13 నుంచి గుత్తి మండలం సేవాఘడ్‌లో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల విజయవంతానికి జిల్లా అధికార యంత్రాంగం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని కలెక్టర్ గౌతమి తెలిపారు. మూడు రోజులపాటు సాగే జయంత్యుత్సవాల పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, సేవాఘడ్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్ధనాయక్, కోశాధికారి బాలనాయక్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి పరిశీలించారు. శుక్రవారం పుట్టపర్తి మండలం దిగువచెర్లోపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ముచ్చటించారు. ఆరోగ్య సురక్షలో సుమారు 105 రోగాలకు వైద్యం అందిస్తారని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సుమారు 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మెరుగైన చికిత్స, వైద్యం అవసరమైన 28 మందిని వివిధ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కామాక్షమ్మ, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, సెక్రటరీ ఓం ప్రసాద్, , వైద్యులు నాగార్జున, సీహెచ్‌ఓ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తోడల్లుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం: తోడల్లుడి హత్య కేసులో నిందితుడిని కళ్యాణదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. కళ్యాణదుర్గం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను సీఐ హరినాథ్ వెల్లడించారు. తాడిమర్రి మండలం నిడిగల్లు గ్రామానికి చెందిన మండల సురేంద్ర చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో తన వ్యసనాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం శెట్టూరు ప్రభుత్వాసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న భార్య సరస్వతిని తరచూ వేధిస్తుండేవాడు. ఈ విషయంగా దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో ఇద్దరికీ సర్దిచెప్పేందుకు తోడల్లుడైన కంబదూరు మండలం డి.చెన్నేపల్లికి చెందిన బోయ చిన్నరాజన్న గత నెల 28న కళ్యాణదుర్గంలోని లిటిల్ రోజెస్ పాఠశాల సమీపంలో నివాసముంటున్న సరస్వతి ఇంటికి చేరుకున్నాడు. సురేంద్రకు సర్ది చెబుతుండగా కోపోద్రోక్తుడైన ఆయన తన భార్యను కత్తితో పొడిచేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో అడ్డుపడిన రాజన్నపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర కత్తి పోట్లకు గురైన రాజన్నను కుటుంబసభ్యులు అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆయన మృతి చెందాడు. దీంతో సురేంద్రపై హత్య కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం కంబదూరు రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద తచ్చాడుతున్న నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పోస్టల్ ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కును అందుకుంటున్న కదిరప్ప కుటుంబసభ్యులు

హిందూపురం: పోస్టల్ ప్రమాద బీమాతో కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తుందని డీపీఎస్ సందేశ్‌మహదేవప్ప అన్నారు. సోమందేపల్లికి చెందిన కదిరప్ప కుటుంబసభ్యులకు తపాలా శాఖ ప్రమాదబీమా పథకం ద్వారా మంజూరైన రూ.10లక్షల చెక్కును శుక్రవారం హిందూపురం పోస్టల్ డివిజన్ కార్యాలయంలో ఆయన అందజేసి, మాట్లాడారు. కదిరప్ప (38) తాను జీవించి ఉన్నప్పుడు రూ.399 ప్రమాద బీమా క్లెయిమ్ తీసుకున్నారని గుర్తు చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న ఆయన ఇంట్లో ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెందాడన్నారు. దీంతో సరైన దాఖలాలను పోస్టాఫీసులో పనిచేసే లక్ష్మయ్య ద్వారా సమర్పించడంతో వారికి ప్రమాద బీమా పథకం వర్తించి రూ.10 లక్షల పరిహారం అందిందన్నారు. కార్యక్రమంలో హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మన్న, పోస్ట్‌మాస్టర్ మార్కండేయులు, పెనుగొండ సబ్ డివిజనల్ హెడ్ విమల్, సీనియర్ మేనేజర్ కృష్ణ, కళ్యాణ్‌రాం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి వృద్ధుడి మృతి



సంజీవప్ప (ఫైల్)

పరిగి: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం శాసనకోట గ్రామానికి చెందిన కురుబ సంజీవప్ప (63)కు భార్య రత్నమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న సంజీవప్ప గత గురువారం సాయంత్రం ఇంటి నుండి బయటకెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం సాయంత్రం బాలిరెడ్డిపల్లి వద్ద ఉన్న నీటి కుంటలో ఆయన మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతుడిని సంజీవప్పగా నిర్ధారించారు. ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెంది ఉంటాడని మృతుడి కుటుంబసభ్యుల చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.


ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు అశోక్

ధర్మవరం రూరల్: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం పట్టణంలోని బసవన్న వీధికి చెందిన మిడతల అశోక్ (30) కార్పెంటర్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. అవివాహితుడైన ఆయన ఇటీవల అనంతపురంలోని ఓ ఇంటిలో కబోర్డు పనులు చేస్తూ అక్కడే అద్దె గదిలో నివాసముంటున్నాడు. వారానికి ఒకసారి ధర్మవరానికి వచ్చి కుటుంబసభ్యులను కలసి వెళ్లేవాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం అనంతపురం నుంచి ధర్మవరానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన... చిగిచెర్ల వద్ద స్పీడ్ బ్రేకర్ రాగానే వాహన వేగాన్ని అదుపు చేసే క్రమంలో నియంత్రణ కోల్పోయి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ఏఆర్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో ఏఆర్ విభాగం పాత్ర చాలా కీలకమని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. స్థానిక పరేడ్ మైదానంలో నెల రోజుల పాటు నిర్వహించిన యాన్యువల్ మొబలైజేషన్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. దీంతో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ఎస్పీ మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఏఆర్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... త్వరలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని సవాళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సాధారణ బందోబస్తు నుంచి శాంతి భద్రతల పరిరక్షణ వరకూ విధుల్లో ఏఆర్ సిబ్బంది పనితీరును కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్ఐలు టైటాస్, రాజశేఖర్‌రెడ్డి, నారాయణ, ఆర్ఎస్ఐలు రాజు, ప్రదీప్‌సింగ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్య

శెట్టూరు: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం యర్రబొరేపల్లికి చెందిన వడ్డే జైమర్రిస్వామి (35)కి ఎనిమిదేళ్ల క్రితం కర్ణాటకలోని గుండార్లపల్లికి చెందిన శాంతమ్మతో వివాహమైంది. వీరికి కుమారుడు తేజ, కుమార్తె నిత్య ఉన్నారు. రెండేళ్ల క్రితం మనస్పర్థలు తలెత్తడంతో శాంతమ్మ తన పుట్టినింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్యను కాపురానికి పిలుచుకు వచ్చేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఆమె సమ్మతించలేదు. దీంతో రెండు రోజుల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి కాపురానికి రావాలని భార్యను బతిమలాడాడు. ఆమె అంగీకరించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన జైమర్రిస్వామి గురువారం రాత్రి తోటకు వెళ్లి అక్కడే ఉండిపోయాడు. శుక్రవారం కుమారుడు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో తండ్రి హనుమంతరాయుడు తోటకెళ్లి పరిశీలించాడు. అప్పటికే మామిడి చెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి బోరున విలపిస్తూ సొమ్మసిల్లిపోయాడు. తేరుకున్న అనంతరం విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు యర్రబొరేపల్లికి చేరుకుని పరిశీలించారు. హనుమంతరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలసిన వీసీలు





వర్సిటీ చాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేఎన్‌టీయూ(ఏ) వీసీ డాక్టర్ వీఆర్ శ్రీనివాసరావు (చిత్రంలో) రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్ , ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి

అనంతపురం: ఏపీ గవర్నర్, వర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను జేఎన్‌టీయూ(ఏ) వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని రాజభవన్‌లో శుక్రవారం గవర్నర్‌ను వారు కలసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు.

కాఫీపొడితో హాస్య బ్రహ్మ



శ్రీరాములు గీసిన బ్రహ్మానందం చిత్రం

రామగిరి: ప్రముఖ హాస్యనటుడు, నవ్వుల బ్రహ్మం.. బ్రహ్మానందం జన్మదినం సందర్భంగా ఆయన అభిమాని, పేరూరు డ్యాం ఏపీఆర్ఎస్ పాఠశాల డ్రాయింగ్ టీచర్ శ్రీరాములు అపూర్వ కానుక ఇచ్చారు. బ్రహ్మానందం చిత్రాన్ని కాఫీపొడితో చిత్రీకరించి, అందరినీ అబ్బురపరిచారు. ఈ సందర్భంగా శ్రీరాములును పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పలువురు గ్రామస్తులు అభినందించారు.

ఏపీ టీచర్స్ జేఏసీ ఏర్పాటు

- ఏపీ సెక్రటరీ జనరల్‌గా పి.అశోక్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డి, సెక్రటరీ జనరల్‌గా వి.ప్రభాకర్



విష్ణువర్ధన్‌రెడ్డి



ప్రభాకర్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో కొత్తగా ఏపీ టీచర్స్ జేఏసీ ఏర్పాటైంది. రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఏపీ టీచర్స్ జేఏసీలో 55 ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యాశాఖ సంబంధిత సంఘాలు భాగస్వామిగా ఉన్నాయి. ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యాశాఖ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి, చర్చలలో ప్రాతినిధ్యం వహించడానికి ఈ జేఏసీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రభుత్వానికి, ఉద్యోగులకు అనుసంధానకర్తగా ఉంటూ వివిధ సమస్యల పరిష్కారానికి జేఏసీ కృషి చేస్తుందని రాష్ట్ర కమిటీ సెక్రటరీ జనరల్‌గా ఎంపికైన పి.అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా ఎన్. విష్ణువర్ధన్‌రెడ్డి (పీఆర్టీయూ), సెక్రటరీ జనరల్‌గా వి.ప్రభాకర్ (పీడీ అసోసియేషన్), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎస్.నాగిరెడ్డి (వైఎస్సార్‌టీఎఫ్), బి.చంద్రశేఖరరెడ్డి (డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం), ట్రెజరర్‌గా కుసుమ పుల్లారెడ్డి (అపుస్మా), కో చైర్మన్లుగా వి.ఓబిరెడ్డి, జి.కృష్ణప్రసాద్, ఆర్.లస్కర్‌నాయక్, కె.యల్లప్ప, వైస్ చైర్మన్లుగా ఎ.గోపాల్, సి.గోపాల్‌రెడ్డి, కె.కవిత, కె.బాబయ్య, సెక్రటరీలుగా జి.వెంకటరమణప్ప, వైసీ ప్రసాదరెడ్డి, ఎస్.కృష్ణకుమార్, సి.నాగేంద్రగౌడ్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎంవీ శివారెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడు ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగుల సమస్యలకు పరిష్కారానికి, మధ్యంతర భృతి, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం అమలుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

ఎంపీడీఓలకు మండలాల కేటాయింపు

అనంతపురం సిటీ: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న ఎంపీడీఓల బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో ఇతర జిల్లాల నుంచి జిల్లాకు వచ్చిన 35 మంది ఎంపీడీఓలకు స్థానాలను కేటాయిస్తూ శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లాకు కేటాయించిన ఎంపీడీఓలు

మండలం	ఎంపీడీఓ
తలుపుల	పి.మహబూబ్‌ఖాన్
నల్లమాడ	ఎండీ మహబూబ్ దౌలా
బత్తలపల్లి	ఎ.శివనాగ ప్రసాద్
హిందూపురం	జి.వెంకటేశ్వరరెడ్డి
చెన్నేకొత్తపల్లి	జి.మోహన్‌కుమార్
లేపాక్షి	ఎన్.సి.హెచ్.వాసుదేవగుప్త
కనగానపల్లి	సి.వెంగన్న
ముదిగుబ్బ	జి.నాగశేషాచల రెడ్డి
పెనుకొండ	కె.విశ్వమోహన్
అగళి	పి.రాజేంద్ర ప్రసాద్
గోరంట్ల	ఎం.జి. ప్రవీణ్‌కుమార్
రొళ్ల	ఎస్.మంజులవాణి
మడకశిర	కె.దాసరి మేరి
నల్లచెరువు	ఎం.రాణేమ్మ
గుడిబండ	డి.బంగారమ్మ
పరిగి	ఎం.హెచ్.సుభాషిణమ్మ
తాడిమర్రి	ఎం.మణిమంజరి